## కథ

# కమీషనర్ గారి క్రిస్మస్


బల్గేరియా మూలం: డిమిత్రీ ఇవనోర్
తెలుగు అనువాదం: అన్వేషి చిలుకూరి

''కాసేపట్లో అక్కడ వుంటాం సార్! సూర్యాస్తమయం అయ్యేలోగా మనం అక్కడి చేరుకుంటాం. కనుచూపు మేరలో ఆ కొండ కోన కనిపిస్తున్నదా? అక్కడికి మనం చేరితే ఇక ఊరు చేరినట్టే అని చెప్పవచ్చు'' అంటూ బండి నడిపే కుర్రాడు తన చేతిలోని కమిచీని బక్కచిక్కిన గుర్రాల వీపుపై ఝుళిపిస్తూ ''యెహే...యెహే....ల్లక్ల్లక్. పదండి అయ్యలూ''! అంటూ అదిలించసాగాడు.



నాలుగు చక్రాల ఆ చిన్న గుర్రపు బండి పల్లెదారిలో ఎప్పట్లాగే బుర దను చిట్లిస్తూ పరుగులు దీస్తోంది. డిసెంబరు వర్షాలతో తడిసిన ఆ నిర్జీవమైన పచ్చిక దోవలో భయంకర మైన శబ్దాలు వినిపిస్తున్నాయి. పాత బడిన బండి నొగలు లోంచి.

ఆ బండికి ముందున్న పెట్టెమీద కూచుని తన గుర్రాలని మళ్లీ అదిలి స్తున్నాడు ఆ పల్లెటూరు కుర్రాడు. తడిసిన తన టోపీ పై భాగాన్ని చేత్తో దులుపుకొని ఓ మాదిరిగా గొంతుతో ఉల్లాసంగా కూనిరాగాలు తీయడం మొదలుపెట్టాడు.




''నీ పేరేంటి బాబూ?'' అంటూ బండి లోపల కూచున్న లావాటి ఉన్నికోటు వ్యక్తి అడిగాడు.

కుర్రాడు వినిపించుకోలేదు. కూనిరాగం తీస్తూనే వున్నాడు.

''ఏయ్! కుర్రాడా!'' అంటూ గట్టిగా అరిచాడు లావాటి మనిషి.

''ఏమిటి?'' అంటూ తిరిగి చూసాడు ఆ కుర్రాడు.

''పేరు, నీ పేరు, నీ పేరేంటి?''

''ఓంద్రా''

''ఓహో! ఓంద్రానా! నువ్వు తెలివైన కుర్రాడివి! నువ్వే కాదులే మీ వాళ్లందరూ తెలివి మీరి పోయారు. మీరంతా వొట్టి పల్లెటూరి బైతులు. కానీ చేసేదంతా రహస్యంగా చేస్తుంటారు. అబద్ధాలు ఆడ్డం, మమ్మల్ని తప్పుదారి పట్టించడం, నేను కోర్టులో చూస్తూనే వుంటా. తెలివిలేని గొరిల్లాగా నటిస్తూంటారు. కానీ మీరు గొరిల్లా కనిపించే గుంటనక్కలు. జడ్జిలతోనే నాటకాలాడతారు.''

''మేము మామూలు పల్లెటూరు వాళ్లం సార్! వాళ్లే మా మీద చెడు ఉద్దేశం కలిగిస్తారు. మీరట్లా అనుకుంటారు కానీ మేము నిజంగా చెడ్డ వాళ్లం కాదండీ! మా రైతులు తప్పుదారి పట్టడానికి కారణం వాళ్ల అజ్ఞానమూ, పేదరికమే.''

''ఓహో అలాగన్నమాట! పేదరికంలో శాపగ్ర స్తులై బాధపడుతున్న వారు కనుకనేనా గేదెలు కుడితి తాగినట్టు సారాయి తాగుతున్నారు. అది సరే నీకు కూడా ఆ తాగే అలవాటు వుందా మిత్రమా! మీ తాగుబోతులు నీకింకా తాగడం నేర్పలేదా? నువ్వింకా చిన్నవాడివిలే. రాసిపెట్టుకో. మీ రైతులు చాలా పోగొట్టుకున్నారు. కానీ అదే మిటో వారికి తెలియదు.''

''మీరు రాసిపెట్టండి సార్! మాకు రాయడం రాదుగా!'' అన్నాడు ఆ కుర్రాడు. తన గుర్రాల వైపుకు తిరుగుతూ వాటిని ''యెహే, యెహే.. ల్లక్ ల్లక్'' అని అదిలించి దీర్ఘాలోచనలో పడిపోయాడు.

ఆ గుర్రాలు కూడా ఏదో ఆలోచిస్తున్నట్టు ఒక్క క్షణం ఆగి తిరిగీ పరుగు అందుకున్నాయి.

ఆ కుర్రాడు తన ఊల్ఫ్ కోటుకున్న పెద్ద కాల ర్‌ను తలపైకి లాక్కుని ఆ కోటులో మునిగి పోయాడు.

చెదిరిపోయిన రెక్కలతో వున్న ఒక కాకి అటు నిరాశాపూరితంగా, ఏదో విచారంలో అరుస్తూ వచ్చి ఆ రోడ్డు పక్కగా వున్న చెట్టుపై వాలింది. అది ఏదో ఆలోచిస్తున్నట్టుగా కనపడింది. ఆ చలికాలం వాతావరణంలో కూడా మబ్బులు ముసిరి వున్నాయి. మరుసటి రోజు రాబోయే క్రిస్మస్ పండ గనాడంతా ముసురు పట్టి వుంటుందని అనిపి స్తోంది. భారీగా కురవడానికి సిద్ధమవుతున్నట్లు ఆ నీలాకాశంలోని మేఘాలు చెప్పకనే చెబుతు న్నాయి. అప్పటికే నేలంతా నీటితో నిండి కొన్ని చోట్ల తేమతోనూ, బురదతోనూ నిండి వుంది. ఆకా శం మబ్బులతో కప్పబడినందువల్ల పల్లెలూ, వాగులూ, సెలయేళ్లూ, దూరాన వున్న అడవుల బాహ్యసౌందర్యం, జీవం లేకుండా కనిపిస్తున్నది. ఆ బండికి పక్కన వున్న పలక వదులయింది. ఎడ తెగకుండా భయంకరంగా పటపటమంటూ ఒకటే చప్పుడు చేస్తూ వుంది. అది ఆ లావుపాటి ఉన్ని కోటు మనిషికి చికాకును కలిగిస్తూ వుంది. చివరకి తన సహనం అంతా కోల్పోయి చేసేదేమీ లేక తన కోటుకున్న పొడవాటి కాలర్‌ను తన లావు మొగం మీదికి లాక్కుని కప్పుకుంటూ గట్టిగా అరిచాడు.

''భయంకరంగా ఈ శబ్దం ఏమిటి? దెయ్యం లాగా!'' అన్నాడు అసహనంగా.

''అదా! పక్కనుండే పలక వదులయిందండీ! అది ఎప్పుడూ చదువుకున్న వాళ్లలాగా ఊరికే లొడ లొడమని చప్పుడు చేస్తూ వుంటుంది. దానికి సమయం సందర్భం వుండదు'' అన్నాడు ఓంద్రా.

''నువ్వు చాలా తెలివైన వాడివి ఓంద్రా! చాలా! అందుకే మీకు పడుచుపిల్లలను ఎట్లా వల్లో వేసుకో వాలో బాగా తెలుసు. కావాలంటే పందెం. మీలాంటి వాళ్లందరూ చిన్న వయసులోనే అంద మైన అమ్మాయిలను పెళ్లి చేసుకుంటారు'' అంటూ పరిహాసం ఆడుతూ తన పొడవాటి కాలర్‌ను వెనక్కి తోశాడు ఆ లావుపాటి మనిషి.

''మీరు చెప్పేది నిజమే. మా ఇళ్లలో పెళ్లా లందరూ అందంగానే వుంటారు. అది సరే గానీ మా ఊళ్లో మీకేదైనా పనుందా? చెప్పండి నేను చేసి పెడతా!'' అన్నాడు ఓంద్రా.

''నేను కోర్టు కమిషనర్‌ని''

ఓంద్రా ఆ మాట వినగానే వెనక్కుతిరిగి అతని మొహాన్ని పరిశీలనగా గుచ్చి గుచ్చి చూశాడు.

''అయితే మీరొచ్చింది డ్యూటీ మీదనుకుంటా?''

''డ్యూటీ మీదా! అవునౌను. మీలోనే ఒకడనుకుంటా మాకో ర్టులో మోసం చేశాడు. కానీ ఈసారి మాత్రం వాడిని నేను శిక్ష పడేట్టు చేస్తాను. ఆడిని పట్టుకోవ డానికి సంబంధించిన ఒక కాగితం నా దగ్గర వుంది. అది ఈ కేసులో వాణ్ని పట్టిస్తుంది. వాడు మా కోర్టు అధికారులను తప్పు దారి పట్టిస్తున్నాడని విన్నాను. ఈ సాయంకాలంలోపునే నేను వాణ్ని పట్టుకుని తీరతాను. నమ్ముతావో లేదో ఈసారి క్రిస్మస్ నా వల్ల వాడికి గుర్తుండిపోయేలా చేస్తాను! వాడి సంపాదనలో ఒక్క పైసా కూడా వద లకుండా జప్తు చేస్తాను. వాడికి గుణపాఠం చెప్ప డమే కాదు. వాణ్ణి చూసి మీ వాళ్లెవ్వరూ మా కోర్టు వాళ్లని మోసం చేయకుండా వాణ్ణి ఒక మోడల్‌గా వుండేట్టు చేస్తాను. మీరు కుళ్లిపోయిన గుడ్లు అమ్మి వ్యాపారులను మోసం చేయవచ్చు. పాడైపోయిన వెన్న అమ్మి పట్నం వాళ్లను మోసం చేయవచ్చు. కానీ చూడూ! మీరు కోర్టును మాత్రం మోసం చేయలేరు. మీలాంటి వాళ్లను ఎట్లా శిక్షించాలో మాకు తెలుసు. కొరడాతో చావగొట్టడం, ఒక్కటే మీకు తగిన శిక్ష. మీరంతా మోసగాళ్లు, తాగుబో తులూ. మీరు పన్నులు కూడా సరిగ్గా కట్టలేరు. మీరే సంఘ విద్రోహులు. మీ వల్లే మాలో దేశభక్తి అనే భావన బొత్తిగా లేకుండా పోతోంది. ఒకవేళ నాకే గనక కనీసం రెండురోజుల పాటు 'జార్' ప్రభువయ్యే అవకాశం వస్తేనా, నా ఇష్టానుసారం మిమ్మల్ని శిక్షిస్తా. నాకే గనక ఆ అధికారం వస్తే మీలాంటి వాళ్లందర్నీ పీనుగులుగా మారుస్తా. కానీ జార్ ప్రభువును కానందుకు చాలా బాధపడుతు న్నాను'' అన్నాడు ఆ కమిషనర్.

ఆ కమిషనర్ అంతవరకూ తొడుక్కుని వున్న తన ఉన్ని కోటు గుండీలను విప్పేసి అప్పుడే కోడి పిల్ల గుడ్డులోనించి బయటకి పగులగొట్టుకు వచ్చి నట్లు కోటు విప్పేసాడు.

''అయ్యో! కమిషనర్ గారూ! దేవుడు ఈ లోకంలో జీవులన్నింటినీ లెక్కప్రకారమే సృష్టించాడు. ఉదాహరణకు ఆడవాళ్లని తీసుకోండి, వారికి గడ్డంతో పనిలేదు కాబట్టి వాళ్లకి గడ్డాన్ని ఇవ్వలేదు. గాడిదకు పొడగాటి చెవులు అవసరం కాబట్టి వాటికి పొడుగాటి చెవులిచ్చాడు'' అంటూ మామూలు గొంతుతోనే అన్నాడు ఓంద్రా!

''నీ పనికిమాలిన మాటలు ఆపి త్వరగా పద. చూడు చీకటి పడుతూ వుంది. నేను ఇంకా తిరిగి ఊరికి పోవాలి. ఒరేయ్ వెధవా! ఇరవై కిలోమీటర్ల దూరానికి మూడు 'త్వా'లు తీసుకుంటావా? మమ్మల్ని ఎట్లా దోచుకోవాలో నీకు బాగా తెలు

సురా! త్వరగా పోనీ ఊ..త్వరగా! ఇట్లాగే పోతుంటే గుర్రాలు నిద్రపోగలవు'' అంటూ మాట్లాడుతూనే వున్నాడు కమిషనర్.

''యెహే!యెహే! జోరుగా పదండి అయ్యలూ!'' అంటూ గుర్రాలను అదిలిస్తూ తన కమిచీని గాలిలో తిప్పుతున్నాడు ఓండ్రా.

''నువ్వు ఆ గుర్రాలను అయ్యలూ అంటావా? తమ్ముళ్లూ అను సరిపోతుంది'' అని ఎగతాళిగా అన్నాడు కమిషనర్.

''వాటిని అయ్యా! అని పిలవకపోతే అవి అవమానంగా భావిస్తాయి. కమిషనర్ గారూ! అవి కూడా నిజాయితీగా పనిచేస్తాయి. అవి చేసే పని కూడా ఉద్యోగం లాంటిదే కదా! అవి ప్రతిరోజూ వేళల ప్రకారం పద్ధతిగా పనిచేస్తాయి. పొద్దున్నే లేస్తాయా, లేవగానే ఒళ్లు రుద్ది స్నానం చేయిస్తామా, ఆ తర్వాత వాటిని వీపుల మీద జీనుల వేస్తామా- అప్పుడు అవి డ్యూటీకి ఎక్కుతాయన్నమాట! మీరు డ్యూటీ చేయడానికి ఆఫీసులకి వెళతారే అలాగన్నమాట! తరువాత సాయంత్రం వరకూ బండిలాగుతాయి'' అన్నాడు ఓండ్రా.

''అది సరే, తాగడానికి మందు ఎక్కడినుంచీ తెచ్చుకుంటావు మిత్రమా! ఊరికే లొడలొడ వాగకు. త్వరగా పోనీ, నాకు ఆలస్యం అయిపోతోంది. నువ్వు దొంగ చూపులు చూడకు జిత్తులమారిలా!'' అన్నాడు కమిషనర్.

''ఇక్కడేమీ తోడేళ్లు వుండవు లెండి. కమిషనర్ గారూ! భయపడకండి'' అన్నాడు, ఓ మాదిరి గొంతుతో ఆ బండి నడిపేవాడు. ఆ గౌరవనీయుడైన కోర్టు కమిషనర్ భయంనిండిన కళ్లతో అటూ ఇటూ తేరిపార చూడసాగాడు.

''నేను భయపడుతున్నది తోడేళ్ల గురించి కాదురా! ఈ చలి గురించి. చలిని తట్టుకోడానికి మంట వేసుకునేంత తీరిక లేదు నాకు''


కాసేపు నిశ్శబ్దంగా బండిసాగింది.

''అయితే మీరు అధికారిక కార్యంపై ఇక్కడికి వొచ్చారా? ఈసారి ఎవరు బలవుతున్నారో'' అంటూ మొహంలో తీక్షణత ధ్వనించే విధంగా అతని వైపు చూశాడు ఓండ్రా.

కమిషనర్ జవాబు చెప్పడానికి ముందు కాసేపు మౌనంగా వుండి తర్వాత అన్నాడు '' నువ్వు ఎందుకు తెలుసుకోకూడదు. వాడిని స్టానైకో అంటారు. పొట్టిగా వుంటాడు. వాడి మెడ లావుగా వుంటుంది.

''అతనా! అతను నాకు తెలుసులెండి! అయితే మీరు అతని ఇంటి మీద దాడి చెయ్యబోతున్నారన్నమాట? చాలా పేదవాడండీ! ఈసారికి అతన్ని వదిలేయండి. ఈ రోజు క్రిస్మస్ కదా! ఏదో చూసి చూడనట్టు ఉండొచ్చుగా. మీకు తెలియనిదేముంది '' అన్నాడు ఓండ్రా.

''అవును, పేదవాడే కానీ చాలా దుర్మార్గుడు!'' అన్నాడు కమిషనర్. తరువాత వారిని నిశ్శబ్దం ఆవరించింది. చీకటి కమ్ముకుంది. మొత్తానికి ఆ పల్లెకు దగ్గర్లో వున్న ఒక కొండమీదికి చేరుకున్నారు.




ఓండ్రా ఆలస్యం చేయకుండా ఆ గుర్రాలను అదిలించి తన చేతిలో వున్న కమిచీతో వాటి వీపుపై దెబ్బలు సున్నితంగా వేశాడు. ఆ తర్వాత ఓండ్రా ఏమీ మాట్లాడలేదు. కనీసం కూనిరాగాలు తీయలేదు. మళ్లీ తిరిగి ధ్యానంలోకి జారుకున్నాడు.

వాళ్లు కొండ కొసకి చేరుకున్న తరువాత తిరిగి రెండవ వైపు కిందికి దిగడం మొదలుపెట్టారు. అప్పటికే రాత్రవుతూ వుంది. కానీ ఆ పల్లెజాడ కనబడలేదు. చాలా చల్లగా వుంది. చల్లగాలులు ఏకధాటిగా వీస్తున్నాయి. ఆ కారు చీకట్లో వెదజల్లబడినట్లు ఆకాశమంతా పరుచుకొని వున్నయి మబ్బులు. అవి వాళ్లున్న కొండ ప్రాంతం వైపే కదులుతూ వస్తూ వున్నాయి. ఆ మబ్బులన్నీ కాసేపట్లోనే ఆకాశంలో ఎంతో ఎత్తుకి కనిపించకుండా వెళ్లిపోయాయి. మరి కాసేపట్లోనే నీలాల నింగిలోని తారలతో నిండిపోయింది. అప్పటికే గాలి బాగా చల్లబడినట్లు వొంటికి తెలుస్తూ వుంది. ఆ వాతావరణానికి ఆ గుర్రాలు ఏదో మోయలేని బరువు మోస్తున్నట్లుగా కష్టంగా, బద్ధకంగా బండిని లాగుతూ వున్నాయి.

''త్వరగా పోనీ! త్వరగా! ఒట్టి బద్ధకస్తుడిలా వున్నావే! ఇలాగే అయితే మనం ఇక్కడే చలికి గడ్డకట్టుకుపోయి చావడం ఖాయం!'' అంటూ అరవడం మొదలుపెట్టాడు ఆ కమిషనర్.

ఓండ్రా ఏదో తెలియని ఆవేశంతో ఆ గుర్రాలను అరుస్తూ, ఆ బక్క పలుచటి గుర్రాలపై కమిచీ ఝుళిపించడం మొదలుపెట్టాడు. అవేమీ పట్టనట్టుగా, విననట్టుగా ఆ గుర్రాలు అలుపు వల్ల నెమ్మదిగా ఆ బండిని లాగసాగాయి.

కమిషనర్ తరువాతి రోజు పొద్దున్నే జప్తుచేయబోయే అమాయకుడైన స్టానియకో గురించి ఓండ్రా ఆలోచనలు సాగుతున్నాయి.

ఈ కమిషనర్ రేపు పొద్దున్నే అతని ఇంటిమీద పడి జప్తు చేసినప్పుడు 'ఈ ఆపద అంతటికీ కారణం నువ్వే కదా ఓండ్రా!' అని కచ్చితంగా అంటాడతను. నేనూ కమిషనర్‌తో పాటే వచ్చానని తెలుసుకుని, ఎగతాళిగా మమ్మల్ని తన కుటుంబంతోపాటు భోజనానికి ఆహ్వానిస్తాడు. తరువాత బాధతో ఏడుస్తాడు. అతను చాలా మృదుస్వభావి అని ఓండ్రాకి తెలుసు.

కచ్చితంగా ఆ అమాయకుడికి సాయం చేయాలి. ఈ రాత్రికి రాత్రే అతను ధాన్యాన్ని దాచుకునే చోటు మార్చి ఎక్కడయినా దాచిపెట్టాలి. లేకపోతే వచ్చేఏడాది అంతా అతను, అతని కుటుంబం ఆకలితో అలమటించి చస్తారు. అందుకే తప్పకుండా ఏదో ఒకటి చేయాలి.

గుర్తులేవీ కనపడలేదు కానీ ఆ చీకట్లో, రోడ్డంతా బురద, చిక్కటి బురద నిండి వుంది. మామూలుగా వెళ్లాల్సిన దారి ఆ చీకట్లో మాయమైంది. బండి మరీ బురదలోకి దిగబడుతోంది.

ఓండ్రా బండికున్న తాళ్లను లాగేసి గుర్రాలను ఆపేశాడు.

''కమిషనర్ గారూ! మనం గాని తప్పిపోయి అపాయంలో పడ్డామని భయంగా వుంది.'' అన్నాడు ఓండ్రా చీకట్లోంచి భయం ధ్వనిస్తున్న కంఠంతో.

కమిషనర్ కంగారుగా ఓండ్రా మొహంలోకి చూసాడు. ఆ చూపులో ఇంతవరకు అతను ఓండ్రా మీద చూపించిన ఆకతాయితనం కనపడ్డంలేదు.

''ఒరేయ్! బాబూ! ఇప్పటికైనా ఒళ్లు దగ్గరపెట్టుకో! ఇప్పుడు జరిగిన దానికి నేను బాధ్యుడిని కాదు, నువ్వే నాతో వాదన పెట్టుకొని దారి తప్పావు.''

ఆ గుర్రాలకున్న కళ్లాలను లాగి చేతిలోని కమిచీతో గుర్రాలపై ఝుళిపించి ''కమిషనర్ గారూ! గట్టిగా పట్టుకోండి!'' అంటూ గట్టిగా అరిచాడు. అల్లంత దూరం పల్లెలోని వీధి దీపాలు మిణుగురుల్లా కనిపిస్తున్నాయి. కుక్కల అరుపులు వినపడేంత దగ్గరలో వాళ్లు ప్రయాణిస్తున్నారు. వారికి కుడివైపు కొన్ని అడుగుల దూరంలో ఒక మడుగు వుంది. మిణుకు మిణుకుమని నిశ్చలమైన నీటితో మెరుస్తూ వుంది ఆ మడుగు ఉపరితలం. గుర్రపు బండి ఆ మడుగు వైపుకు తిరిగి ఆ దిశగా పోవడం మొదలుపెట్టింది.

''ఏమిటది?'' అంటూ అడిగాడు కమిషనర్.

''ఇది బురద నేలండీ కమిషనర్ గారూ! ఈ బురదనేల దార్లోనే మనం పోవాల్సిందండీ! ఈ నీళ్లు ఎక్కువ లోతుండవు. భయపడకండి. అక్కడక్కడా కొన్ని గోతులుంటాయి. అంతే మామూలుగా నేను బండిలోగానీ, నడుచుకుంటూ గానీ వెళ్లేటప్పుడు వాటిని చీకట్లోకూడా తప్పించుకుని పోతుంటానండీ! జాగ్రత్తగా పట్టుకుని కూర్చోండి చాలు!'' అంటూ తన గుర్రాలను ''పదండి అయ్యలూ!'' అంటూ అదిలించసాగాడు.

ఆకాశాన్ని ప్రతిబింబిస్తున్న ఆ నిశ్చల నీటిలోకి ఆ గుర్రాలు జాగ్రత్తగా, చిన్నగా, కొద్దికొద్దిగా దిగసాగినాయి. నీటి అడుగున వుండే బురదలో వాటి కాళ్లు మెత్తగా కూరుకుపోతున్నాయి. ఆ మడుగులోని ఆకుపచ్చరంగు నీళ్లు, ఆ గుర్రాలు దిగడంతో నిశ్చలంగా వున్న ఆ మడుగు ప్రాణం పోసుకున్నట్లుగా అలలు అలలుగా అలజడితో కదలసాగింది.

''నువ్వు మనిషివా, పశువ్వా? ఆపు!'' అంటూ భయంతో గట్టిగా అరిచాడు కమిషనర్. తన కోటును ఒంటి చుట్టూ బిర్రుగా కప్పుకుంటూ ''అరే ఆపావేం? నిలువునా తడిపేస్తున్నావు. ఒరేయ్ వెధవా, నీకు కనబడట్లేదా? బండిలోకి నీళ్లు వస్తున్నాయిరా! ఆపరా, ఆపు!'' అన్నాడు మళ్లీ బిగ్గరగా.

ఒండ్రా బండి ఆపేశాడు. అప్పటికే ఆ గుర్రపు బండి కొద్దిగా లోతుకు దిగబడి వుంది. ఆ బురద గుంట మధ్యలో ఇప్పుడు వాళ్లు వున్నారు. ఆ కారుచీకట్లో వాళ్లకు ఒడ్డు ఏదో తెలియడం అసాధ్యం.

''ఏయ్ పదండి ముందుకు'' అని తన గుర్రాలను ఒండ్రా ఆజ్ఞాపించాడు. ఆ గొంతు చీకటిని చీల్చుకుని పోయింది. వారికి దగ్గరలో వున్న కొన్ని అడవి బాతులు ఆ శబ్దానికి భయపడి రెక్కలు కొట్టుకుంటూ చీకట్లో కలిసిపోయాయి.

ఒరేయ్ వెధవా! మనం ఇక్కడ నుంచీ బయటపడ్డాక చెబుతా నీ పని, సున్నంలోకి ఎముకలు లేకుండా విరగ్గొట్టకుంటే చూడు! మనం ఇక్కడ నూతిలో కప్పల్లా మునిగిపోతున్నాం రా! గాడిదా! '' అంటూ తిట్లదండకం ఎత్తుకున్నాడు కమిషనర్.

''లేదు! మనం మునిగిపోలేదండీ కమిషనర్ గారూ! భయపడకండీ! ఇక్కడ ఎవరైనా దారి తప్పుతారు. కాసేపు గాభరా పడకుండా ప్రశాంతంగా ఉండండి!'' అని చెప్పి బండికి కట్టేసున్న గుర్రపు పట్టీలను పరీక్షగా గమనించడం మొదలుపెట్టాడు. గుర్రపు కొక్కేలు సరిగా ఉన్నాయో లేదో చూస్తూ వాటిని వదులు చేసి తప్పించాడు. తనను తానే గట్టిగా తిట్టుకుంటూ ఎడతెరిపి లేకుండా శపించుకుంటూ చివరికి ఆ చీకట్లోనే తన డ్రైవర్ సీట్‌ను వెతుక్కుని కూచున్నాడు. తన కమిచీని తీసుకొని అదిలిస్తూ ''పదండి ముందుకు హెయ్! పదండి!'' అంటూ అరిచాడు ఒండ్రా.

గుర్రాలు ఆ బండిని లాగుతూ ముందుకు వెళ్లాయి. ఉన్నట్లుండి ఒక గుర్రం పట్టెడలోనించి జారిపోయింది. అక్కడి నుంచి అది బురదలో ముందుకు జారింది. అప్పుడు ఆ బండికి దానికి వున్న పట్టీల నుంచీ అది విడిపోయింది. తక్కిన ఇంకో గుర్రంబండితో పాటు అలాగే నిల్చుని వుంది.

''ఏయ్! ఏమిటి? ఏమయింది?'' అంటూ కేకలు వేశాడు కమిషనర్.

''అయ్యో! ఆగు! డోర్కా, డోర్కా! ఉండవే ఇట్లా రావే!'' అంటూ ఆ విడిపోయిన గుర్రాన్ని నెమ్మదిగా బతిమాలుతున్నట్లు అరుస్తూ తిరిగి వెనక్కి రమ్మని పిలుస్తూ ఉండిపోయినాడు ఒండ్రా.

కానీ ఆ గుర్రం నీళ్లలో కొద్దిగా భయపడి చుట్టూ చూసుకొని తిరిగి ఒడ్డుకు పోయే వైపుగా ఈదడం మొదలుపెట్టింది. తన యజమాని పిలుస్తున్న పిలుపును, అభ్యర్థనను ఎరగనట్టుగా, పూర్తిగా మరిచిపోయినట్టుగా తనంతట తాను ఒడ్డు వైపుకు ఈదుకుంటూ వెళ్లిపోయింది.

కమిషనర్ ఖిన్నుడై ఈ సంఘటనను బండి లోంచి చూసి నిలువునా భయంతో కంపించిపోయాడు.

వెంటనే ఒండ్రా బండి దగ్గర మిగిలిన గుర్రాన్ని విడిపించి దానిపైకి దూకి, డోర్కా వెళ్లిన దారిలోనే దాన్ని కూడా తీసుకొని గట్టిగా ''డోర్కా! డోర్కా ఆగు వెనక్కి వచ్చేయ్యి!'' అంటూ అరుస్తూ వెళ్లడం మొదలుపెట్టాడు.

''ఏయ్! ఎక్కడికి వెళుతున్నావ్! ఒరేయ్ ఏం చేస్తున్నావ్? ఒరేయ్ వెధవా ఆగు. లేకపోతే నిన్ను చంపేస్తా'' అని గట్టిగా అరిచాడు కమిషనర్.

ఆ చీకట్లో అతని అరుపులకు బదులుగా నవ్వు ఒక్కటి వినిపించింది.


''ఒరేయ్ ఆగరా! అయితే నన్ను ఇక్కడే వదిలివెళ్లిపోతున్నావన్నమాట! ఇక్కడ వున్న క్రూర మృగాలకు నన్ను బలిచేయబోతున్నావన్నమాట. బాబాయ్! ఏయ్ పిచ్చోడా అట్లా చేయొద్దురా! నిన్ను వేడుకుంటున్నానురా!'' అంటూ బతిమిలాడుతున్నాడు కమిషనర్ వణుకుతున్న గొంతుతో.

''భయపడకండి, భయపడకండి కమిషనర్ గారూ! ఈ మురికి గుంటలో ఏ క్రూర జంతువులూ వుండవు. నా బండిలోని ఎండు గడ్డిని పరుపులా చేసుకొని పడుకోండి ఈ రాత్రికి. దానికి నువ్వు ధర చెల్లించనవసరం లేదు. తెల్లవారగానే వచ్చేస్తాను.''

''బాబూ నన్ను వదిలి వెళ్లొద్దు. తమాషాకి ఇది సమయం కాదు. వెనక్కిరా! ఇక్కడ నుంచీ నన్ను బయటపడేయ్!'' అంటూ అభ్యర్థించాడు కమిషనర్.

''ఇక్కడ చాలా చీకటిగా వుందండీ! నాకేమీ కనిపించట్లేదు! ఒకవైపు నా గుర్రం పారిపోయింది. మీరే చెప్పండి నేను మీకెలా సాయం చేయగలనో!'' అన్నాడు ఒండ్రా ఎగతాళిగా.

ఆ ఎగతాళి మాటలు విన్నాడు కమిషనర్. ఆ మాటలు చీకట్లో ఎటో కొట్టుకుపోయాయి. భయంతో కమీషనర్ ఏదో వెతుకుతూ ఆ చీకట్లో ఆ మురికి కుంటలో ఒంటరిగా వుండిపోయాడు.




''ఒండ్రా! దయచేసి వెనక్కు రా! నీకు ఎంత కావాలన్నా ఇస్తాను. ఏది కావాలన్నా ఇస్తాను. దయచేసి సాయం చెయ్. లేకపోతే నేను ఇక్కడే చనిపోతాను. నీకు హృదయం లేదా? '' అంటూ అరుస్తున్నాడు నిస్సహాయత నిండిన గొంతుకతో. ఒండ్రా విన్నా కూడా జవాబివ్వనట్టున్నాడు. కమిషనర్ దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు.

''ఒరేయ్ పశువా! ఒరేయ్ గాడిదా! ఒరేయ్ మృగమా! నన్ను ఇక్కడ నుంచీ బయటపడేయరా! నా పిల్లలు నాకోసం ఇంటి దగ్గర ఎదురుచూస్తుంటరా!రేపు క్రిస్మస్‌రా! నన్ను కాపాడరా! ఒరేయ్ పిశాచీ!'' అంటూ మొత్తుకుంటున్నాడు కమిషనర్.

అరిచినంతసేపూ అరిచి తిరిగి మళ్లీ బండిలోకి దూరి తను కప్పుకున్న కోటును తీసి విసిరికొట్టి దుఃఖం ఆపుకోలేక చిన్నపిల్లాడిలా ఏడ్వడం మొదలుపెట్టాడు.

కానీ ఆ చిమ్మచీకటిలో సమాధానం ఇవ్వలేదు. ★